# అసలు మాది కిష్కింధ!

**మా** వూరికో కోతి వచ్చింది - ఓ రోజు పొద్దున్నే మావూరి పిల్లకాయలు దాన్ని అంజనేయస్వామి ఆలయం గోడ మీద చూశారు. అది పేలకోసం వెతుక్కుంటుంటే నవ్వారు. కాని అది కనుబొమలు పైకెత్తి నుదురు ముడతలు పడి దీర్ఘాలోచనలో ఉన్నప్పుడు పిల్లకాయలకి ఆశ్చర్యం వేసింది.

పెద్దవాళ్ళు జోక్యం కలిగించుకోకపోతే కోతి ఏమయి ఉండేదో మరి. పిల్లకాయలు కోతిని చూసి గంటసేపైనా ఆనందించారో లేదో ఈ లోపుగా ఆ దారినే పోతూ, పురాణం చెప్పే శాస్త్రులుగారు గుడిముందాగి, "మనోజంమారుత తుల్యవేగం... శ్రీరామదూతం శిరసా నమామి" అంటూ ఏదో గొణగసాగాడు. కోతి కాస్తా ఆయన కెదురుగా వచ్చి నుంచుని కిచకిచలాడింది.

సాయంకాలానికల్లా కోతి మావూరికి అతిథి అయిపోయింది. రామకోటి రెండోసారి రాస్తున్న రామదాసుగారూ, ఆ మధ్యనే చచ్చి బతికిన గుప్తగారూ, పురాణం చెప్పే శాస్త్రులుగారూ, హనుమదుపాసి గౌరీశంకర పార్వతీ పరమేశ్వర సుబ్రహ్మణ్యేశ్వర్లుగారూ వగైరాలంతా కోతికి భక్తులయినారు.

పిల్లలు పుట్టనివాళ్ళూ, పిల్లలు దక్కనివాళ్ళూ పొద్దుపోని వితంతువులూ వగైరాలు ఆరోకాలం కింద తయారయింది.

కోతి కలిసొచ్చిందని పూకరు పుట్టింది. కోతి వచ్చిన తరవాత మా వూరికి కలరా రాలేదు. మా వూళ్ళో ఇల్లేదీ కాలలేదు. మా వూరికి ఉప్పెన కూడా రాలేదు. (మా వూరికి సముద్రం పాతికమైళ్ళ దూరం ఉంటే ఏం. మా తాత అయిదేళ్ళ వాడై ఉండగా వచ్చిన బందరు గాలివానకి వరదవచ్చి మావూరి బయటవున్న తాళ్ళెక్కితే అంత దూరాన స్పష్టంగా కనిపించిందిట. ఇది మా తాత స్వయంగా చూసిన విషయం!)

కోతి బలిసింది. మరి అది ఏ ఇంటో జొరబడి అందిన ఆహారం పుచ్చుకోవటానికైనా హక్కుంది. మా వూరికి పురపాలక సంఘంలేదు గాని ఉంటే ఈ హక్కు తీర్మాన రూపంలో ఇవ్వబడి ఉండేదే.

బీదలూ, సాదలూ, అలగా జనమూ చాటుమాటున కోతిని కొడుతున్నట్టు ఊళ్ళో

తెలియగానే ఊరంతా అట్టుడికిపోవటమేగాక ఊళ్ళో పౌరసభ కూడా ఒకటి జరిపి అందులో కోతిని కొట్టిన వాళ్ళమీద భయంకర నిరసన తీర్మానం కూడా చెయ్యబడింది.

క్రమంగా కోతి తనబలం తెలుసుకోసాగింది. అది మొదట్లో చిన్న పిల్లల్ని మాత్రమే భయపెట్టుతూ ఉండేది. రానురాను అది పెద్దవాళ్లను కూడా భయపెట్టసాగింది. ఎటువంటి విచక్షణా లేకుండా అందర్నీ అటకాయించి పిలకలు వగైరా పీకసాగింది.

కోతిక్కోపం వచ్చింది. ఉపశాంతికోసం ఓ యజ్ఞమో సప్తాహమో చేతామనుకున్నారు. మావూరి కోటయ్య శ్రేష్టి, యజ్ఞానికి కావలసిన వస్తువులన్ని తను సరఫరాచేసే షరతుమీద ఓ వంద చందా కూడా వేస్తానన్నాడు. కాని అది పడలేదు. చందాలు బాగా పోగుకాలేదు.

ఆఖరుకు ఊరిబయట మరో పౌరసభ జరిగింది. అందులో కోతి ఊరికి హానికరమని దాన్ని వదిలించేటందుకు సాంఘిక సేవకులంతా నడుములు కట్టుకోవలసిందని తీర్మానం జరిగింది.

ఈ సభకు వెనుక కమ్యూనిస్టులున్నట్టు వదంతి పుట్టింది. వెంటనే ఊళ్ళో మరో సభ చేసి పెద్దలు, కోతిమీద కుట్ర చేస్తున్నందుకు కమ్యూనిస్టుల మీద ఒక నిరసన తీర్మానం చేశారు. ఈ తీర్మానానికి వోటు చెయ్యటానికి కిసాను పార్టీని, కాంగ్రెసు పార్టీలనూ, హిందూ మహాసభనూ, జస్టిసు పార్టీనీ, ఇంకా తదితర హంగులను సభకాహ్వానించారు.

కోతి యథాప్రకారం స్వైరవిహారం చేస్తున్నది.

ఓనాడు షేక్‌మస్తాన్ గుడిపక్కగా ఖాళీ ఒంటెద్దు బండి తోలుకుపోతూ పురాణం చెప్పే శాస్తుల్లుగార్ని చూసి, "కోతీ మాచెడ్డా గడ్బడ్‌గా హుంది, చాస్తుల్లు గారూ!" అన్నాడు.

"ఆ కమ్యూనిస్టులు నీకేమన్నా గడ్డి పెడుతున్నారా ఏం? వాళ్ళమాటవిని మాదేముణ్ణి తిడితే నీకు పాకిస్తానిస్తామనుకున్నావు గామాలు?" అన్నాడు శాస్తుల్లు గారు నిప్పులు కక్కుతూ.

"ఈ కాబోతే ముడ్డికింద యేసుక్కూకొండి, మారాజ్!" అంటూ మస్తాన్ ఎద్దునదిలించాడు.

ఇంతట అకస్మాత్తుగా కోతి మాయమైంది.

మళ్ళీ పౌరసభ జరిగింది. కోతిని మాయం చేసిన వాళ్ళమీద నిరసన తీర్మానం చేయబడింది.

కోతిని మాయం చేసింది కమ్యూనిస్టులే అనే తీర్మానం ప్రతిపాదించి, బలపరిచి క్షణంలో నెగ్గించారు. మావూరి పంతులు మాట్లాడుతూ కమ్యూనిస్టుల వల్ల మా వూరికి జరుగుతున్న అపచారాలను గురించి ఉపన్యసించి నిర్మాణ కార్యక్రమం గురించి అరగంట సేపు చెప్పి కూచున్నాడు.

కోతి మాలపల్లి చేరగా అక్కడ పోలిగాడు వగైరాలు దాన్ని పట్టుకుని బస్తీకి తీసుకుపోయి అప్పుడక్కడ నడుస్తున్న సర్కసువాళ్ళ కమ్మినట్టు వదంతిగా ఉన్నదని ఎవరో లేచి అన్నారు.

వెంటనే సభాధ్యక్షుడు లేచి ఇటువంటి దుర్వార్తలు పుట్టిస్తున్నది కమ్యూనిస్టులేనని, మావూరి పౌరులు హరిజనులమీద ఇటువంటి నిందలు ప్రచారం చెయ్యటం ద్రోహమనీ అన్నాడు.

మావూరి పంతులు మళ్ళా లేచి హరిజనోద్ధరణ మీద మరో అరగంట మాట్లాడాడు. హరిజనుల్లో కూడా ఇప్పుడిప్పుడు కొందరు కమ్యూనిస్టుల మాటలు విని చెడిపోతూ ఉన్నట్టు తెలిసి తన హృదయం దహించుకుపోతున్నదన్నాడు.

అప్పటికే కాలాతీతమైనప్పటికీ, హరిజనులను చెడగొట్టుతున్నందుకు కమ్యూనిస్టుల్ని నిరసించుతూ ఒక పెద్ద తీర్మానం చెయ్యబడింది.

నేను రహస్యంగా అధ్యక్షుడితో, “కోతిని వెతికి పట్టుకొచ్చేటందుకో తీర్మానం చేసి దానికిగాను చందాలు వసూలు చేస్తే ఏం?” అన్నాను.

“కాలాతీతమైపోయింది” అన్నాడధ్యక్షుడు.

***మొదటి ముద్రణ : పెంకిపిల్ల, మార్చ్ 1945***